క్లుప్తంగా

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కుసుమలత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో మంచి నీటి బావి మరమ్మతుల కోసం రూ.5లక్షలతో తీర్మానం చేశామని తెలిపారు. దీంతో పూడిక తీత, పక్క గోడల నిర్మాణం చేపడతామని చెప్పారు. వెంటనే పనులు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా నీటి సమస్య తలెత్తితే ఎంపీపీ నిధులతో పరిష్కరిస్తామని వివరించారు.

జిల్లా స్థాయి షటిల్ పోటీలు

ఆత్మకూరురూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌డోర్ స్టేడియంలో ఈనెల 18,19 తేదీల్లో నంద్యాల జిల్లా స్థాయి షటిల్ (డబుల్) పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు కేటగిరీల్లో జరిగే పోటీల్లో క్యాటగిరి 1 (35 సంవత్సరాల లోపు) విజేతలకు వరుసగా రూ.8,000, రూ.5000 , రూ.2000 తో పాటు షీల్డ్ బహుకరిస్తామని వెల్లడించారు. అలాగే క్యాటగిరీ – 2 (35 – 50 సంవత్సరాల వారికి) విజేతలకు రూ.10,000, రూ.5,000, రూ.3,000 నగదుతోపాటు షీల్డ్ అందజేస్తామన్నారు. క్యాటగిరీ – 3 (50 సంవత్సరాలపై వారికి) వరుసగా రూ.5,000, రూ.2,000 + షీల్డ్ బహుకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోపు రూ.300 ప్రవేశ రుసుమును 9052481732 చెల్లించి పేర్లు రిజిష్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9000600149, 9177101438, 7780237505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయండి

పాములపాడు: డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ ఆదేశించారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. 100 మీటర్ల మేర ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామంలో గతంలో వర్షపు నీటితో పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొనే వారు. కాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకురావడంతో వెంటనే నిధులు మంజూరు చేశారు. దీంతో జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వర రెడ్డి, సర్పంచు వరప్రసాద్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం రహదారిపై ఆక్రమణల తొలగింపు పనులను చేపట్టారు.

అడవుల్లో అప్రమత్తంగా ఉండాలి

బండిఆత్మకూరు: శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తులు అటవీ మార్గంలో అప్రమత్తంగా ఉండి అటవీ సంపదకు భంగం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎఫ్ఆర్‌ఓ నాసిర్‌ఝా తెలిపారు. గుండ్ల బ్రహ్మేశ్వరం, ఓంకార క్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తులు తమవెంట అగ్గిపెట్టులు తీసుకొని వెళ్లరాదని, ధూమ పానం చేయరాదన్నారు. దీనివల్ల అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగి జంతుసంపద, వృక్ష సంపద నాశనం అవుతుందన్నారు. అడవుల్లో జంతువుల వేటకోసం ఉచ్చులు బిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

బుడగ జంగం ఆధ్వర్యంలో అన్నదానం

ఆత్మకూరు: శ్రీశైలక్షేత్రంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి దేవస్థానం పరిధిలోని వేమన ఆరాధ్య పీఠం వద్ద బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అన్నదాన సత్రం నిర్వాహకులు సిరిగిరి గోవిండ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి ఈ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇక్కడ స్థలం ఇరుకుగా ఉన్నప్పటికి అన్నదానం నిర్వహిస్తున్నామని, అధికారులు స్పందించి మరో చోట స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మధు, మురళి, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సురేంద్ర నాయుడు రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. గురువారం హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది ఆ విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీజీ హైస్కూల్‌లో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఈసీఓ ఫ్రెండ్లీ మెటీరియల్ (పర్యావరణ హిత వస్తువులు) విభాగంలో వ్యర్థమైన పదార్థాలతో డీజిల్ తయారు చేయుట గురించి ప్రదర్శించడం జరిగిందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందున ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేశారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి, సైన్స్ విభాగ ఉపాధ్యాయులను అభినందించారు.

అభిషేక ప్రియుడు.. మల్లికార్జునుడు

- జలంతో అభిషేకించినా కోర్కెలు తీరుస్తాడని భక్తుల నమ్మకం
- సోమవారం, పర్వదినాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు

అభిషేక ప్రియుడైన శ్రీశైల మల్లికార్జున స్వామిని అభిషేకించుకోవడానికి భక్తులు ఆత్రుతపడుతుంటారు. రకరకాల ఫల రసాలు, వివిధ రకాలైన పూలు, పంచామృతాలు వంటివే కాదు.. కేవలం కొద్దిపాటి జలంతో శివున్ని అభిషేకిస్తే మురిసిపోయి, ముచ్చటపడి భక్తులు కోరిన కోరికలన్నింటినీ తీరుస్తాడని భక్తుల నమ్మకం. అభిషేకం అంటే ఏమిటి, శివున్ని ఏ ఏ ద్రవ్యాలు, పూలు, పత్రితో పూజిస్తే ఎలాంటి ఫలితం దక్కుతుందన్న విషయాలపై శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం... – శ్రీశైలంటెంపుల్



అభిషేక ప్రియుడు మల్లికార్జున స్వామి

అభిషేకం టికెట్టు రూ.1,500

జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామి అభిషేక ప్రియుడు. దేశవ్యాప్తంగా ఉన్న జ్యోతిర్లింగాలలో శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం, పర్వదినాల్లో ఆయా లింగ స్వరూపులను శాస్త్రోక్తంగా అభిషేకించుకుంటారు. శ్రీశైలంలో మల్లన్నను అభిషేకించుకోవడానికి సుమారు 50 ఏళ్ల క్రితం 10 పైసలు ఉండేది. ప్రస్తుతం సామూహిక అభిషేకం దంపతులకు రూ.1,500, గర్భాలయ అభిషేకం రూ.5వేలు టిక్కెట్టు ధర ఉంది.

అభిషేక మంత్రం

అభిషేకంలో ముందుగా అర్చకులు మహాన్యాసం ఆచరిస్తారు. ఇందులో వివిధ బీజ మంత్రాలతో వేదమంత్రాలను కలిపి ముఖ్యమైన నమకచమకాలతో సాగే అభిషేకం సాక్ష్యాత్తు రుద్రస్వరూపం, నమో నమో అంటూ సాగే నమకం సృష్టిలో దాగిన ప్రతి వస్తువు, మనిషికి జరిగే ప్రతి చర్య రుద్రస్వరూపమే అంటూ వారందరికీ నమస్కారం చేస్తూ సాగుతుంది. దీనినే రుద్రనమకమని పిలుస్తారు. చమే చమే అంటూ సాగే చమకం పరమశివుని సృష్టిలోని అనేకమైన ఐశ్వర్యాలను, భౌతిక జీవనానికి కావాల్సిన వాటిని అందజేయమని కోరుతూ సాగుతుంది.

శివున్ని వివిధ ద్రవ్యాలతో అభిషేకించడం వలన కలిగే ఫలితాలు

ద్రవ్యం	ప్రయోజనం
పాలు	దుఃఖ నాశనం
పెరుగు	ఆరోగ్యం
నెయ్యి	గుణవంతులు, తేజోవంతులు అయిన సంతానం
పంచదార	బుద్ధి వికాసం
చెరకురసం	ఆనందం
కొబ్బరినీళ్లు	ధనవృద్ధి
భజ్మజలం	మహాపాపనాశనం
పన్నీరు	దేహపుష్టి
అవిసనూనె, విప్పనూనె, నువ్వులనూనె	శత్రునాశనం, రాజ్యలాభం
పుష్పోదకం	భూలాభం
బిల్వదళజలం	భోగభాగ్యాలు
సువర్ణజలం	దారిద్రనాశనం
ద్రాక్షఫలరసం	ధనప్రాప్తి
ఖర్జూరజలం	సుఖజీవనం
నేరేడుపళ్లరసం	సకల విజయాలు
కస్తూరిజలం	శత్రుహని నివారణ
మామిడి పళ్ల రసం	ధన,ధాన్య, గృహ ప్రాప్తి
నవరత్నజలం	చక్రవర్తిత్వం
గంగాజలం	శివసాయుజ్యం
సుగంధ పరిమళ జలం	భోగప్రాప్తి
శుద్ధజలం	సర్వపాపాహారం

నేడు శ్రీశైలానికి మల్లన్న పాగా

శ్రీశైలంటెంపుల్: ఏ శైవక్షేత్రంలో లేని విధంగా శ్రీశైలంలో మాత్రమే మల్లన్నకు పాగాలంకరణ ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో మల్లికార్జునుడిని పెళ్లి కొడుకుగా సిద్ధం చేసేలా తలపై పాగాను చుట్టడమే ఈ పాగాలంకరణ. ప్రకాశం జిల్లా హస్తినాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం వంశపారపర్యంగా మల్లన్న తల పాగాను తయారు నేస్తోంది. రోజుకో మూర చొప్పున 300 రోజులు 300 మూరలు నేస్తారు. కార్తీకమాసంలో మంచిరోజు చూసుకుని పాగా వస్త్రం నేతను ప్రారంభిస్తారు. ఇందుకోసం స్వచ్ఛమైన తెల్లటి దారాన్ని వినియోగిస్తారు. పాగా తయారీలో పృథ్వి వెంకటేశ్వర్లు కీలకం కాగా అతని భార్య గౌరీ కుమారి, కుమారుడు వెంకటసుబ్బారావు, కోడలు దుర్గ పాగా నేతలో నియమ నిష్ఠలను పాటిస్తారు. మహాశివరాత్రి పర్వదినానికి 15 రోజుల ముందు వస్త్రాలతో శాస్త్రోక్తంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శ్రీశైలం బయలుదేరుతారు.



తయారు చేసిన పాగా

ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని నేసిన పాగాను తీసుకుని శుక్రవారం శ్రీశైలం చేరుకోనున్నారు. అనంతరం దేవస్థాన అధికారులకు పాగాను అందించనున్నారు. పాగా వస్త్రంతో వచ్చే వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతారు. భోజనం, వసతి, ప్రత్యేక దర్శనాలతో పాటు ఆర్థిక ప్రోత్సాహన్ని కూడా అందజేస్తారు.

పర్యాటక ప్రాంతాల్లో మారుమోగిన ఓంకార నాదం



సాక్షి గణపతి వద్ద కిక్కిరిసిన భక్తులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్ర సమీపంలోని సందర్శనీయ స్థలాలన్నీ గురువారం శివనామస్మరణతో మారుమోగాయి. వేకువజాము నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి, పాలధార, పంచధార, శిఖరేశ్వరం, మల్లమ్మ కన్నీరు తదితర క్షేత్రాలలో మహాశివుని జపిస్తూ ఓంనమఃశివాయ శివనామస్మరణతో శ్రీగిరి పర్వతం మారుమోగింది. పలువురు భక్తులు దీక్షను విరమించే సమయంలో సమీపంలోని క్షేత్రాలను సందర్శించి శివున్ని ఆరాధించారు. తొలి ఆరాధ్య దైవమైన సాక్షి గణపతి వద్ద మొక్కులు తీర్చుకుంటూ, శ్రీశైలం చేరుకుంటున్నారు.

రేపు కాశీచంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం



ముస్తాబైన కాశీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం



స్వామివారి మూలవిగ్రహం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో వెలసిన శ్రీకాశీ చంద్రమౌళీశ్వరస్వామి వారు ఈనెల 18న కళ్యాణ మహోత్సవానికి సిద్ధమవుతున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం నాడు అర్ధరాత్రి శ్రీహైమావతి, చంద్రమౌళీశ్వరస్వామి వార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కార్తీక్ గురువారం తెలిపారు. కల్యాణం అనంతరం 19న ప్రభోత్సవం, 20న సాయంత్రం రథోత్సవం, 21న పారువేట, 22న తీర్థావళి కార్యక్రమంతో స్వామివారి ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

19న పొట్టేళ్ల పందెం

ఈనెల 19న ఉదయం 11గంటలకు పొట్టేళ్ల పందెం , 20న అంతరాష్ట్రస్థాయి ఎద్దుల బండలాడుగు పోటీలు, 22న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న పొట్టేళ్ల యజమానులు సెల్ నెంబర్లు: 9177018129, 9505095913, ఎద్దుల యజమానులు 9182130655, 8790402050, కబడ్డీ క్రీడాకారులు 9573318692, 9133716867 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఆనందంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పందుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ పందుల సంచారం ఉండటంతో భక్తులకు ఇబ్బందిగా ఉందన్నారు. మండల పరిషత్, పోలీసు అధికారులు వెంటనే పందుల యజమానులతో మాట్లాడి సుదూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

18న బండలాగుడు పోటీలు


జూపాడుబంగ్లా: మహాశివరాత్రి సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో ఈనెల 18న అంతరాష్ట్రస్థాయి న్యూకేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని పగిడ్యాల రోడ్డులోని జీవనజ్యోతి స్కూలు వద్ద ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ నెంబరు: 9704094837కు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరండి

ఆత్మకూరు: విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే విద్యాభ్యాసం కొనసాగించాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓపెన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహాలను అందించడమే కాకుండా ఎన్.సీ.సీ, ఎన్.ఎస్.ఎస్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ తదితర సౌకర్యాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తోందని తెలిపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్వర వైద్య సేవలు అందించాలి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తరలివస్తున్న వేలాదిమంది భక్తులకు వైద్యసేవలను సత్వరమే అందించాలని శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆదేశించారు. గురువారం క్షేత్ర పరిధిలో పలుచోట్ల పర్యటించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కైలాసద్వారం, అన్నప్రసాద వితరణ, దేవస్థానం వైద్యశాల, క్యూలైన్లు, క్యూలలో ప్రసాద వితరణ, చలువ పందిర్లు, ప్రథమ చికిత్సా కేంద్రాలు తదితర వాటిని పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ అంతరాయం లేకుండా నిరంతరం కైలాసద్వారానికి నీటి సరఫరా చేస్తుండాలని నీటి సరఫరా విభాగాన్ని ఆదేశించారు. కైలాసద్వారం వద్ద పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్ విజయలక్ష్మి, డాక్టర్ కనకదుర్గ తదితరులు ఉన్నారు.



దేవస్థానం వైద్యశాలను పరిశీలిస్తున్న చైర్మన్

భక్తులకు నిరంతరం అన్నప్రసాదాల వితరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం పరిధిలోని అఖిల భారత శ్రీశైల కుమ్మరశాలివాహన నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం భక్తులకు అందజేస్తున్నారు. ముఖ్యమైన పర్వదినాలు కార్తీకమాసం, శ్రావణమాసం, దసర, సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది పర్వదినాల్లో అపరిమితంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. సత్రం కమిటీ అధ్యక్షులు బండారి భిక్షపతి,ప్రధాన కార్యదర్శి కుమ్మరలక్ష్మన్న, కోశాధికారి బొమ్మిన శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

శివస్వాములకు అన్నపూర్ణ ఆశ్రమంలో..

శ్రీశైలమహాక్షేత్రానికి శివదీక్షను స్వీకరించి వచ్చిన శివస్వాములకు స్థానిక అన్నపూర్ణాదేవి ఆశ్రమంలో శివోహం కమిటి టెంపుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఏడాదిపాటు ఆశ్రమానికి వచ్చే భక్తులకు భోజన ప్రసాదాన్ని అందిస్తూ శివరాత్రి భక్తులకు ప్రత్యేకంగా అల్పాహార, భోజన వితరణ చేస్తూ, వారు సేదతీర్చుకునేందులు పలు ఏర్పాట్లు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు అంతిరెడ్డి అరవింద్‌రెడ్డి తెలిపారు.



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న శాలివాహన సత్ర నిర్వాహకులు

నీటి సమస్య తలెత్తనీయొద్దు

పాములపాడు: వేసవి ఆరంభమవుతున్నందున అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్యను తలెత్తనీయొద్దని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సరోజినీ వర్ధినియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు సమర్పించగా, ప్రజా ప్రతినిధులు పలు సమస్యలపై గళం విప్పారు. ప్రధానంగా సర్పంచులు తాగు నీటి సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. 3 నెలలకొకసారి సమావేశానికి రావడం అధికారులు చెప్పినవి వినడం తప్పా మేమేమి చేయగలమని అసహనం వ్యక్తం చేశారు.

- వేంపెంట గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య ఉందని గత సమావేశంలో తెలిపామని, చర్యలు శూన్యమని సర్పంచు మాణిక్యమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మి అన్నారు.
- బానకచెర్ల గ్రామంలో చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయని సర్పంచు ఆవుల జయసుధ అన్నారు.
- రూ.11 లక్షలు ఖర్చు చేసి పనులు చేస్తే కేవలం రూ.3లక్షలు మాత్రమే బిల్లులు వచ్చాయని గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా చేయాలని మిట్టకందాల సర్పంచు నారాయణ పేర్కొని, సమావేశం నుంచి వెళ్లి పోయాడు.
- ఎర్రగూడూరు గ్రామంలో ఎస్ఆర్ఎంసీలో నీరు తగ్గాయని, గ్రామంలోకి నీటి సరఫరా కష్టసాధ్యమని, సరైన చర్యలు తీసుకోవాలని కోరారు..

అధికారుల గైర్హాజరు

సర్వసభ్య సమావేశానికి 6 శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరైనట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. విద్యుత్‌శాఖ, కో ఆపరేటివ్ సొసైటీ, తెలుగుగంగ ప్రాజెక్టు, ఏపీఎస్ ఆర్‌టీసీ, కార్మికశాఖ, మత్స్యశాఖ, అటవీశాఖ అధికారులు సమావేశానికి హాజరుకాలేదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతిరామలింగేశ్వరరెడ్డి, డాక్టర్లు నాగలక్ష్మి, లావణ్య, ఎంఈఓ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు,



అధికారులను ప్రశ్నిస్తున్న బానకచెర్ల సర్పంచు ఆవుల జయసుధ

నాణ్యతగా, వేగవంతంగా పనులు చేపట్టండి

జూపాడుబంగ్లా: ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి సూచించారు. నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో రూ.1.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా శాప్ కోఆర్డినేటర్ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, మధు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

ఈద్గా గోడ పరిశీలన

కూల్చిన ఈద్గా గోడను నందికొట్కూరు పట్టణ ఎస్ఐ ఎన్‌వీ రమణ, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పట్టణానికి చెందిన రఘు అనే వ్యక్తి జేసీబీతో ఈద్గా గోడను కూల్చివేశాడని పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు ఎస్ఐకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఎస్ఐ, చైర్మన్ కర్నూలు రోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్లి కూల్చిన గోడను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, పబ్లిక్ స్థలాల్లో తవ్వకాలు కానీ ఎలాంటి పనులు చేయరాదన్నారు. ఎవరైనా అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా ప్రభుత్వ, పబ్లిక్ స్థలాల్లో తవ్వకాలు చేపట్టినట్లయితే సంబంధిత వ్యక్తి, పనులు చేసిన జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

బావిని శుభ్రం చేయించండి

కొత్తపల్లి: గువ్వకుంట్ల గ్రామంలోని ఈశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న బావిని అధికారులు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కె.వెంకటేశ్వర రెడ్డి, ఎస్.శివరామిరెడ్డి, నాగయ్య, కె.వెంకట శివారెడ్డి, ఎం.రామేశ్వరరెడ్డి కోరారు. గ్రామంలోని బావివద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా బావినీటిని అధికారులు శుభ్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపై పాచీ పేరుకుపోయి వాడుకొనేందుకు వీలుగా లేవన్నారు. శుభ్రం చేసుకునేందుకు కనీసం బ్లీచింగ్ పౌడర్‌ను కూడా పంచాయతీ కార్యదర్శి ఇవ్వడంలేదన్నారు.

ఏటేటా పెరుగుతున్న బాలశివస్వాములు

ఆత్మకూరు: శ్రీశైలమహాక్షేత్రంలో ఏడాదికేడాది శివరాత్రి సందర్భంగా శివమాలా ధారణ చేసిన బాలస్వాముల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రెండో కైలాసంగా శోభిల్లుతున్న శ్రీగిరిలో రెండు, మూడు, నాలుగు ఇలా 12 సంవత్సరాల లోపు బాలశివస్వాములు భారీ సంఖ్యలో తల్లితండ్రులతో కలిసి ఇరుముడితో స్వామి సన్నిధికి చేరుకున్నారు. జ్యోతిస్వరూపుడిని దర్శించి ఇరుముడిని సమర్పిస్తున్నారు. గతేడాది క్షేత్రానికి వచ్చిన బాలస్వాముల సంఖ్య దాదాపు 1200 ఉండగా ఈ ఏడాది నాలుగువేల దాకా ఉన్నట్లు అంచనా.



ఇరుముడులతో బాలస్వాములు

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సాయిరాం కళాశాల చైర్మన్ పి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని అల్వాల ఫంక్షన్‌హాల్‌లో సాయిరాం కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంటు పద్మావతమ్మ, గౌరవ అతిథి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాలల చైర్మన్ పి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం తిరుపతి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన రైతులకు ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. త్వరలోనే పట్టణంలోని నూతన ల్యాబ్‌ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయాధికారి నరేంద్రారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

చార్జింగ్ గంటకు రూ.50

ఆత్మకూరు: శ్రీశైలక్షేత్రంలో సెల్‌ఫోన్ల చార్జింగ్ మోత గంటకు రూ.50కి చేరింది. శివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారి సన్నిధి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో కాలినడకన వచ్చే భక్తులు తమ వెంట సెల్‌ఫోన్లు తెచ్చుకుంటున్నారు. దీంతో క్షేత్రంలో ఈ ఏడాదిపెద్ద ఎత్తున సెల్‌చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీరు చార్జింగ్ పెట్టడానికి గంటకు రూ.50 లు వసూలు చేస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీగా ఉన్నా ఎక్కించుకోరు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు డిపోల నుంచి పదుల సంఖ్యలో శ్రీశైలానికి స్పెషల్‌బస్సులు నడుపుతున్నారు. అయితే ఆ బస్సుల్లో కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల నుంచి నేరుగా శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకుంటున్నారు. కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్లే స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల్లేకుండా ఖాళీగా వెళ్తున్నా నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు వరకు వెళ్లే ప్రయాణికులను ఎక్కించుకోవటం లేదు. దీంతో ఆర్టీసీకి నష్టం రావడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొని స్పెషల్ బస్సుల్లో నందికొట్కూరు, జూపాడు బంగ్లా, పాములపాడు, ఆత్మకూరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను ఎక్కించుకొని సంస్థకు ఆదాయం పెంచేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

‘అప్పర్‌భద్ర’తో రాయలసీమకు ముప్పు

జూపాడుబంగ్లా: కర్ణాటక ప్రాంతంలో నిర్మించతలపెట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ బోర్ల సీమగా మారే ప్రమాదం ఉందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి తెలిపారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ఆయన నివాసం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం వద్ద నిర్మించే తీగల వంతెన వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మాణం వల్ల రాయలసీమకు ప్రయోజనం కలుగుతుందనే విషయం అందరికీ అవగతం కావటంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఓ అవగాహనకు వచ్చారని తెలిపారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ఎగువన కర్ణాటక ప్రాంతంలో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి ఏపీ, తెలంగాణ సీఎంల అంగీకారం లేకుండా ఏకరీతిన ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలపడం, నిధులు మంజూరు చేయటం, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించటం హేయమైన చర్య అన్నారు. రూ.5,300కోట్ల వ్యయంతో నిర్మించనున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల దిగువన ఉన్న రాయలసీమ ప్రాంతానికి నీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అందువల్లే సేవ్‌రాయలసీమ నినాదంతో ఈనెల 25న ఆర్డీఎస్ నుంచి ఆదోనికి పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించారు. 28న ఆదోనిలో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజాప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 1న సంతకాల సేకరణ చేసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేపడతామన్నారు.